క్లుప్తంగా

వాస్తు యోగ్యతాపత్రం అందుకున్న మస్కాపూర్ వాసి



పత్రం అందుకుంటున్న సతీశ్ కుమార శాస్త్రి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన బోరిగామ సతీశ్‌కుమారశాస్త్రి ఇటీవల ప్రాచీన విశ్వకర్మ వాస్తుశాస్త్రం అభ్యసించినందుకుగానూ యోగ్యతాపత్రాన్ని అందుకున్నారు. జగిత్యాల పట్టణంలోని పురోహిత సంఘ భవనంలో రెండు రోజులుగా జరిగిన ప్రాచీన వాస్తు అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ప్రముఖ పండితులు వెంకటాచార్య గురుకుల్, జనార్దన శివాచార్యులు, కారంపూడి కృష్ణమూర్తి, విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనర్సింహశాస్త్రి, అనిల్‌శాస్త్రి చేతుల మీదుగా యోగ్యతాపత్రం, పురోహిత బ్రహ్మ బిరుదు అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, బీర్నంది, పాతఎల్లాపూర్, కడెం, లింగాపూర్, బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. నెలవారీ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయంలో డీఈ పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గుట్టపై ఉన్న శ్రీ చందా మహంకాళి అమ్మవారిని శుక్రవారం మున్సిపల్ డీఈ హరిభువన్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసిన డీఈని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల రామకృష్ణ, సిరికొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న మిత్రబృందం

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన జాదవ్ సురేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దస్తురాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–04లో అతడితో పదోతరగతి చదివిన మిత్ర బృందం రూ.33వేలను జమ చేసి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజునాయక్, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి

ఖానాపూర్: ప్రతి బస్టాండ్‌లో శిశువులకు పాలిచ్చేందుకు తల్లుల(బాలింతల) కోసం గది ఏర్పాటు చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఖానాపూర్ చైర్మన్ షేక్ షకీల్ కోరారు. ప్రయాణ వేళ పాలిచ్చేందుకు బాలింతలు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం గది ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు లేఖ రాస్తామని పేర్కొన్నారు.

వీధులను శుభ్రంగా ఉంచాలి

లోకేశ్వరం: చెత్తా చెదారం లేకుండా గ్రామాల్లోని వీధులను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం లోకేశ్వరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. డ్రెయినేజీల్లో పూడిక తీసి రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలని పేర్కొన్నారు. ఎంపీవో సోలామన్‌రాజ్, కార్యదర్శులు ఉన్నారు.

జీవన ఎరువులు వాడాలి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కార్తీక్

లోకేశ్వరం: ప్రతీ రైతు తమ పొలాల్లో భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులు తప్పనిసరిగా వాడాలని ముధోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్ అన్నారు. మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో జీవన ఎరువు వాడే విధానంపై ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ రెండు కిలోల పీఎస్బీని విత్తన శుద్ధి, నారుకట్టలు ముంచే పద్ధతి ప్రధాన పొలంలో పశువుల ఎరువులో కలిపి చల్లటం, ఏదో ఒక పద్ధతి అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో లోకేశ్వరం ఏవో గిరిరాజ్, ఏఈవో భూమేశ్, రైతులు పాల్గొన్నారు.

సరస్వతీ గుడిలో సౌకర్యాలేవి?

- మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అసంపూర్తి పనులు
- సరిపడా సిబ్బంది, గదులు, మూత్రశాలలు కరువు
- ప్రవేశాలు పెరుగుతున్నా.. వసతులు కల్పించని వైనం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



అసంపూర్తిగా అదనపు గదుల నిర్మాణం

ఖానాపూర్: జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ అత్యధిక మంది విద్యార్థులు కలిగి ఉన్న మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం 30 మంది విద్యార్థులకో ఉపాధ్యాయుడు ఉండాలి. కానీ 800 మంది విద్యార్థులున్న ఈ బడిలో 15 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మూత్రశాలలను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో బాలికలకు 9, బాలురకు 9 మాత్రమే మూత్రశాలలు ఉన్నాయి. పాఠశాలలోని డైనింగ్ హాల్‌తోపాటు సుమారు రూ. కోటి 50లక్షలతో మన ఊరు– మన బడి కింద చేపట్టిన భవనం పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించాల్సి ఉన్నప్పటికీ నేటికి అప్పగించలేదు. చుట్టూ ప్రహరీ, అదనపు గదుల కొరతతోపాటు మరో రెండు గదుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పీజీహెచ్‌ఎం పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల చరిత్ర ఇది..

పాఠశాలలో గతేడాది పదో తరగతిలో 129 మంది విద్యార్థులకు గాను 128 మంది ఉత్తీర్ణత సాధించారు. 56 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. గతేడాది పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీలో 8 మంది సీట్లు పొందగా ఈ ఏడాది 9 మంది ఎంపికయ్యారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్)లో 2024–25 విద్యాసంవత్సరంలో నలుగురు, 2023–24లో 19 మంది, 2022–23లో 18 మంది, 2021–22లో 14 మందితోపాటు మొత్తం 116 మంది ఎంపికయ్యారు. పలువురు విద్యార్థులు క్రీడల్లోనూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు పేరు తీసుకొస్తున్నారు.



ప్రార్థనలో విద్యార్థులు



పాఠశాలకు కరువైన ప్రహరీ

ఉపాధ్యాయులను నియమించాలి

పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో 15 మంది ఉపాధ్యాయులు కావాలి. ప్రస్తుతం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో వెంటనే పోస్టులను కేటాయించాలి. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ఎంఈవోకు విన్నవించాం. ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే వచ్చే ఏడాది మరిన్ని ఫలితాలు సాధిస్తాం. ఈ ఏడాది బడిబాటలో 200 మందికి పైగా విద్యార్థులు పాఠశాలలో ప్రవేశం పొందారు.

– నరేందర్‌రావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం, మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్

ఎన్‌ఎల్‌ఎం సభ్యుల పర్యటన



తిమ్మాపూర్(జి)లో ఇంకుడుగుంత పరిశీలిస్తున్న ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు

నిర్మల్: మండలకేంద్రమైన సర్నాపూర్(జి)తో పాటు తిమ్మాపూర్(జి) గ్రామంలో నేషనల్ లెవెల్ మానిటరింగ్ (ఎన్‌ఎల్‌ఎం) టీం సభ్యులు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి శుక్రవారం పర్యటించారు. తిమ్మాపూర్(జి)లో గ్రామసభ నిర్వహించి, ఉపాధి కూలీలు, ఐకేపీ సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై ఆరా తీసి, వాటిని ఉపయోగించుకునే తీరును వివరించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నర్సరీ, పశువులపాకల నిర్మాణం, ఇంకుడు గుంతలు, తదితర పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కార్యాలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్, ఏపీఓ జగన్నాథ్ ,ఈసీ అనిల్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం సర్నాపూర్(జి)లో తూతూమంత్రంగా పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో ఉపాధి కూలీలు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. మండల కేంద్రానికి చెందిన ఎండీ. జాబీర్ అనే యువకుడు ఉపాధి పథకం కింద గ్రామాల్లోని ఫిష్ పాండ్ పనులను పొక్లెయిన్లతో చేయించారని ఫిర్యాదు చేశాడు. ఈవిషయమై గత మే నెల 5న కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని వాపోయాడు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు




కుంటాల: సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో సభ్యత్వ నమోదు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ పాత్ర వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సయ్యద్ అన్సర్, ఉపాధ్యక్షుడు సలీం హైమది, మండల అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కుంటాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని పీఆర్టీయూ మండల కన్వీనర్ అంబకంటి సతీశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింబా(కె), తదితర గ్రామాల పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండా ప్రవీణ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు బరకుంట నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మానాజీగారి సిద్ధిరాం, కార్గాం మోహన్, మహిళా ఉపాధ్యక్షురాలు అక్మి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



పల్సిలో పనులు ప్రారంభిస్తున్న అధికారులు

కుభీర్: మండలంలోని పల్సి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఐదు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం అధికారులు, నాయకులు ముగ్గు పోశారు. మండలానికి మొదటి విడతలో 700 ఇళ్లు మంజూరవగా.. 300 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీడీవో సాగర్‌రెడ్డి పేర్కొన్నారు. 200 మంది వానాకాలం పంట చేతికొచ్చే సమయంలో నిర్మించుకుంటామని పేర్కొనగా.. మరో 200 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పాండుసింగ్, మాజీ సర్పంచ్ హన్మండ్లు, నాయకులు సబ్బిడి రాజు ఉన్నారు.

కుంటాల: మండలకేంద్రంలో 34 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీవో ఎంఏ రహీంఖాన్ సూచించారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులు ఉన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ–విముక్తి) జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా కన్వీనర్ చుక్కల కళ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల జాప్యం, నిర్లక్ష్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖాళీ స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉద్యమకారులకు రూ.కోటి సాయం, ఇల్లు లేనివారికి 250 గజాల ఇంటి స్థలం, బ్యాంకు నుంచి రుణ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇష్టా షేక్ షావలి, పీఓడబ్ల్యూ సునీత, సుశీల, సయ్యద్ శమాన, శిప్ప లతిక, రేణుక, పోల్కి నాగరాణి, శిల్ల గంగన్న, లక్ష్మి పాల్గొన్నారు.

సాగునీటి కాలువలు అభివృద్ధి చేస్తా

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



మామడ: కొరిటికల్‌లో డిస్ట్రిబ్యూటరీ కాలువ పరిశీలిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మామడ: సాగునీటి కాలువల అభివృద్ధికి కృషి చేస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొరిటికల్ గ్రామంలో డిస్ట్రిబ్యూటరీ కాలువపై రూ.14లక్షలతో పూర్తి చేసిన కల్వర్టు మరమ్మతులు పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్, నాయకులు రావుల రాంనాథ్, బాపురెడ్డి, రంజిత్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, లింగారెడ్డి, రాజేశ్వర్, గంగన్న, చక్రపాణి, చిన్నారెడ్డి, రవి, నర్సారెడ్డి, ఆనంద్, లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు..

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామ పెద్దమ్మతల్లి ఆలయం, పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్‌తో కలిసి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, శ్రీనివాస్, అనిల్‌రావు, సందీప్, అజయ్, సురేందర్, భీమన్న, లింబాద్రి తదితరులు ఉన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతూ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి పలువురు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో సకాష్ కుల సంఘ భవనానికి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని శ్రీ సోమక్షత్రియ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాంపల్లి శివకుమార్‌వర్మ, రాచర్ల నర్సయ్య వర్మ కోరారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే స్థలం కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కాపాడాలి

తానూరు(ముధోల్): తమ గ్రామంలో కబ్జాకు గురైన సమ్మక్క, సారలమ్మ భూమిని కాపాడాలని ముధోల్ మండలంలోని ఎడ్‌బిడ్ తండా వాసులు శుక్రవారం తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. ముధోల్ మండలం ఎడ్‌బిడ్ తండాలోని సర్వే నంబర్ 359/24లో ఉన్న 3:30 ఎకరాల భూమిని 1989లో సమ్మక్క–సారలమ్మ ఆలయం పేరిట కేటాయించారు. ఎనిమిదేళ్ల కిందట ఆలయం భూమిని జాదవ్ రేణుకబాయి తన పేరిట అక్రమంగా మార్చుకొని సాగు చేస్తుందని తండావాసులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు సదరు భూమిని తిరిగి ఆలయానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎడ్‌బిడ్ తండావాసులు ధూమ్‌నాయక్, గజానంద్ నాయక్, శ్యామ్‌రావు, అమర్‌సింగ్, శ్యామ్‌రావు, మాధవ్‌రావు, ధర్మ, రాంనాథ్, గణపతి రాథోడ్, జైచంద్, దీప, దత్త, జీవన్, రేఖాజీ తదితరులు ఉన్నారు.

ఎన్నికకు నామినేషన్లు

భైంసాటౌన్: భైంసా గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ చేపట్టినట్లు ఎన్నికల అధికారి ఎండీ జబీయోద్దీన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్షుడి బరిలో అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బరిలో కిషన్ గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. సంఘం ఎన్నికల నిర్వహణకు కోర్టు అనుమతిచ్చిందని.. ఫలితాల వెల్లడిని నిలిపి ఉంచాలని పేర్కొన్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు దేవేందర్‌రావు, ఎక్సైజ్ ఎస్సై గజేందర్, సంఘ సభ్యులు ఉన్నారు.

ఘనంగా బోనాలు



భైంసారూరల్: వాలేగాంలో ఆలయానికి వెళ్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



భైంసాలోని కిసాన్‌గల్లీ శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో..



తానూరులోని పాఠశాలలో..

భైంసారూరల్: ఆషాడమాసం పురస్కరించుకొని మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేస్తూ బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధిక, ఉపాధ్యాయులు ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల, శ్రీ గౌతమి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారు, పోతరాజుల వేషధారణలో అలరించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

తానూరు(ముధోల్): తానూరులోని వాగ్దేవి, ముధోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బోనాల వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్లు అరవింద్‌రెడ్డి, రాజేందర్, డైరెక్టర్లు భీంరావ్ దేశాయ్, పోతన్న యాదవ్, అవినాశ్, ప్రిన్సిపాల్ ఉషాకిరణ్‌మై ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో టిల్ ఫ్లవర్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. కరస్పాండెంట్లు ప్రభాకర్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో రోగాల బారిన పడొద్దు



కుంటాల: నీరు పారబోయిస్తున్న రహీంఖాన్

లోకేశ్వరం: వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీవో సోలామన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఇంటింటా తిరిగి డ్రై డేపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ నిల్వనీరు, చెత్త కుప్పలతోనే దోమలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శి రాజేశ్వర్ ఉన్నారు.

కుంటాల: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీవో ఎంఏ రహీంఖాన్ సూచించారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా కుంటాలలో వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాత పాత్రల్లో నిల్వనీటిని పారబోయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాపు, వైద్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు ఉన్నారు.

పువ్విచ్చి.. ఆప్యాయంగా పలకరించి



నిర్మల్‌లో పువ్విచ్చి స్వాగతం పలుకుతున్న అధికారి దేవపాల

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద బస్సులో ప్రయాణికులకు అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల శుక్రవారం గులాబీ పూలు ఇచ్చి... ఆప్యాయంగా పలకరించారు. ప్రయాణికుల సమస్యలను అడి గి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ బస్సు సురక్షితం, శుభప్రదమని పేర్కొన్నారు. కంట్రోలర్లు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

భైంసాటౌన్: ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని భైంసా డీఎం హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రయాణికులకు గులాబీ పూలు అందజేశారు. డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులు ఉన్నారు.

నైబర్‌హుడ్ సెంటర్ తనిఖీ



సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కృష్ణమూర్తి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని నైబర్‌హుడ్ సెంటర్‌ను సెర్ప్ డైరెక్టర్ కృష్ణమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో అందుతున్న సేవలను ఆరా తీశారు. పలు రిజిస్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. దివ్యాంగులకు అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇందులో డీపీఎం విజయలక్ష్మి, సీసీ రవి, నిరోష తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు

కుంటాల: అనారోగ్యానికి గురైతే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని వైద్యురాలు శృతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో హెచ్ఐవీ, బీపీ, షుగర్, హెపటైటిస్, సుఖ వ్యాధులకు సంబంధించి 102 మందికి పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు అమృతయాని, సూపర్ వైజర్ సుజాత, ఏఎన్‌ఎంలు సక్కుబాయి, సుచరిత, హెచ్‌ఏ ఎస్వీఎన్ ప్రసాద్, వైఆర్‌జీ కేర్ సూపర్‌వైజర్ శశిమాల, మంజుల, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: దస్తురాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కడెం మండలం ఉడుంపూర్ పంచాయతీ పరిధి ఇస్లాంపూర్ గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని, తాజా ఆహారం మాత్రమే తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి 39 మందికి మందులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో ఎస్.కన్నయ్య, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, సంతోష్, హెల్త్ అసిస్టెంట్లు మల్లేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



చిన్నారులతో సీఐ అజయ్‌కుమార్

ఖానాపూర్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఖానాపూర్ సీఐ సీహెచ్.అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మస్కాపూర్ గ్రామ వాసవి స్కూల్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించగా సీఐ హాజరై మాట్లాడారు. తమ పుట్టినరోజున ఒక్కో మొక్క నాటి సంరక్షించాలని చిన్నారులకు సూచించారు. ఈసందర్భంగా అడవుల సంరక్షణపై చిన్నారుల నాటికలు, నృత్యాలు అలరించాయి. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి 150 మొక్కలు నాటారు. మాజీ జెడ్పీటీసీ రామునాయక్, ప్రిన్సిపాల్ హర్షవర్ధిని, డైరెక్టర్ పుప్పాల సాగరికకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.